క్లుప్తంగా

పెద్దమ్మకు వెండి వడ్డాణం బహూకరణ



వెండివడ్డాణం అందజేస్తున్న దాత దాసి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన శ్రీ పెద్దమ్మ అమ్మవారికి ఇదే గ్రామానికి చెందిన దాసి చంద్రశేఖర్‌రెడ్డి, సతీమణి లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు సుమారు రూ.30 వేల విలువ వెండి వడ్డాణం విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు వడ్డానం ఇచ్చారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు మాధవి, లావణ్య, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత



ఫిక్సిడ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ, హెచ్ఎం, పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (2005–06) స్నేహితుడి కుటుంబాలకు చేయూతనిచ్చారు. అనారోగ్యంతో మృతి చెందిన మిత్రులు లక్ష్మి సురేష్, సోమశేఖర్ కుటుంబాలకు అండగా నిలిచారు. ఒక్కో కుటుంబానికి రూ. 50 వేలు చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ మేరకు డిపాజిట్ పత్రాలను బాధిత కుటుంబాలకు ఆదివారం కరస్పాండెంట్ బుగ్గన నాగభూషణం రెడ్డి, హెచ్ఎం ఆదినారాయణ చేతుల మీదుగా అందజేశారు.

అబ్దుల్‌కలాం జయంతి

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరు గ్రామంలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి ఆధ్వర్యంలో ఆదివారం దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం సేవలను ఈ సందర్భంగా బ్రహ్మానంద ఆచారి గుర్తు చేశారు. కార్యక్రమం గ్రామస్తులు బాలహనుమంతు, భాస్కర్, పుల్లయ్య, రసూల్‌బాషా పాల్గొన్నారు.

తొమ్మిది మందిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో గొడవ పడిన ఇరువర్గాలకు చెందిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. బలిపి రామచంద్రుడు ట్రాక్టర్‌కు కూలీ పనికి వస్తానని జడలమ్మగారి సాయికుమార్ రూ.600 అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. తర్వాత పనికి రాకపోవడం, తీసుకున్న అడ్వాన్స్ తిరిగి చెల్లించక పోవడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుకుని ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు గొడవ పడ్డారు. దీంతో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

కేవీకే శాస్త్రవేత్తకు రైతు నేస్తం అవార్డు



అవార్డు అందుకుంటున్న కేవీకే శాస్త్రవేత్త సుధాకర్

బనగానపల్లె : మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్య విభాగపు శాస్త్రవేత్త ఎం సుధాకర్ రైతు నేస్తం అవార్డు అందుకున్నారు. కృష్ణాజిల్లా, ఆర్మూరు గన్నవరంలో ఆదివారం రైతునేస్తం 19వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకటయ్య నాయుడు చేతుల మీదుగా సుధాకర్ ఈ అవార్డును అందుకున్నారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీతో పాటు శాస్త్రవేత్తలు సుధాకర్‌కు అభినందనలు తెలిపారు.

వర్షం కోసం గంగమ్మకు పూజలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నందిపాడులో గ్రామపెద్దలు, రైతుల ఆధ్వర్యంలో ఆదివారం వర్షం కోసం గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఊరి వెలుపుల ఉన్న చెరువు వద్దకు మేళతాళాలతో బోనాలు తీసుకెళ్లి గంగమ్మకు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రోగులకు రొట్టె, గుడ్డు పంపిణీ

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రార్థన సమయం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన రవి, సరిత అనే దంపతుల ఆర్థిక సహాయంతో ఆసుపత్రిలోని బాలింతలు, గర్భిణులు, రోగులకు రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు జాన్‌ప్రభాకర్, సిబ్బంది రాజేష్, ఫక్రుద్దీన్, మున్నాలు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

- అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాల వర్తింపు
- నవరత్నాలతో ఇంటింటా వెలుగులు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



రూ. 10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలకు అతీంగా ప్రభుత్వ పథకాల వర్తింపుజేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తున్నారన్నారు. మండల పరిధిలోని లింగాల గ్రామం ఎస్సీ కాలనీలో రూ. 10 లక్షల డీఎంఎఫ్ నిధులతో సీసీరోడ్డు, గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం కింద రూ. 8 లక్షలతో డ్రైనేజీ, జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 14 లక్షలతో పూర్తిచేసిన పైప్‌లైన్‌ను ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, కాటసాని ప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎల్ఐసీ రామసుబ్బారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలెన్నింటినో అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత నాలుగున్నరేళ్ల సంక్షేమ పాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. గ్రామస్థాయిలో పరిపాలనను వికేంద్రీకరణ చేస్తూ గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల ముంగిటకే పథకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని కోరారు.

రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులు:

లింగాల గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో ఇప్పటి వరకు రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని గ్రామ సర్పంచ్ డీవీ వెంకటసుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు డీవీ శేషిరెడ్డి గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కుందూనది, పాలేరువాగులో నీరు– చెట్టు పేరుతో రూ. 4 కోట్ల ప్రజాధనాన్ని దోచుకుని దాచుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా గ్రామంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి టీడీపీ నాయకులకు కన్పించలేదా అని ప్రశ్నించారు. రూ. 1.14 కోట్లతో చెన్నకేశవస్వామి, శివాలయ జీర్ణోద్ధర పనులు జరుగుతున్నాయన్నారు. రూ.1.19 కోట్లతో లింగాల నుంచి గుండుపాపల రోడ్డులో సీసీరోడ్డు, జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 14 లక్షలతో పైప్‌లైన్ పనులు, గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో రూ. 36 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, రూ. 10 లక్షలతో ఆయకట్టురోడ్లు ఏర్పాటు చేశామన్నారు. రూ. 32 లక్షలతో నాడు–నేడు పథకం కింద పాఠశాలను అన్నివిధాలా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, బాలమద్దిలేటి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్వ శేషిరెడ్డి, ఏర్వ వెంగళరెడ్డి, సుధాకర్‌రెడ్డి, భీమిరెడ్డి రాంపుల్లారెడ్డి, బైరెడ్డి సుధాకర్‌రెడ్డి, బాల వెంకటరెడ్డి, నాగేశ్వరరెడ్డి, బ్రహ్మనందరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు రాంశంకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి, మోహన్‌రెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఈఓపీఆర్‌డీ రాధిక, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఏఈలు హరీష్, చెంచయ్య పాల్గొన్నారు.

పాలేరువాగును పరిశీలించిన ఎమ్మెల్యే

మండలంలోని లింగాల సమీపంలో పాలేరువాగు వంతెనను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం పరిశీలించారు. పురాతన వంతెన శిథిలావస్థకు చేరుకుని పూర్తిస్థాయిలో దెబ్బతినింది. పాత వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి కృషి చేయాలని సర్పంచ్ వెంకటసుబ్బమ్మ, డీవీ శేషిరెడ్డి, తదితరులు ఎమ్మెల్యేను కోరారు. వంతెన నిర్మాణానికి రూ. 30 లక్షలతో ప్రతిపాదనలు పంపి సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



దెబ్బతిన్న వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నేటి నుంచి గడపగడపకు మన ప్రభుత్వం

అవుకు: అవుకు మండలంలో సోమవారం నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి ఆదివారం తెలిపారు. 16వ తేదీన గుండ్ల శింగవరం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి ప్రజలతో మమేకమవుతారని, సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. అదేవిధంగా 17, 18వ తేదీల్లో అవుకు–1 గ్రామ సచివాలయ పరిధిలో, 19, 20వ తేదీల్లో అవుకు–2 గ్రామ సచివాలయ పరిధిలో, 21,22వ తేదీల్లో అవుకు–3 గ్రామ సచివాలయ పరిధిల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, ఉపసర్పచ్, గ్రామ సచివాలయ సిబ్బంది, సచివాలయ, బూత్ కమిటీ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక సాయం

డోన్ టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన విలేకరి మధుకు తోటి పాత్రికేయులు తమవంతుగా ఆర్థిక సాయం చేశారు. డోన్ డివిజన్‌లో ఒక టీవీ ఛానల్ ప్రతినిధిగా పని చేస్తున్న మధు గత నెలలో బైకుపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కర్నూలు వైద్య శాలలో చికిత్సల అనంతరం స్వగ్రామమైన కృష్ణగిరి మండలం కటారుకొండలో విశ్రాంతి తీసుకుంటున్న మధుకు ఆదివారం విలేకరులు తమ వంతు సాయంగా రూ.75వేలు అందజేశారు. కార్యక్రమంలో రవి, ఖాదర్, శేఖర్ రెడ్డి, మురళీ, మహేష్, సుధాకర్, తారక్, నాగరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రోత్సవాలకు మంత్రి బుగ్గనను ఆహ్వానించిన ఆర్యవైశ్యులు



మంత్రి బుగ్గనను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో జరుగుతున్న దసరా నవరాత్రోత్సవాలకు హాజరు కావాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఆర్యవైశ్యులు ఆదివారం ఆహ్వానించారు. పట్టణంలోని మంత్రి స్వగృహంలో ఆర్యవైశ్య సంఘం మండల అ. ధ్యక్ష, కార్యదర్శులు కంద గడ్డల మోహన్‌రావు, గురవయ్య, ట్రెజరర్ గుండా జయచంద్రయ్య ఆధ్వర్యంలో మంత్రికి దసరా నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెంచుగూడేనికి మౌలిక వసతులు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని బిలాడిపత్రి సమీపంలోని చెంచుగూడేనికి మౌలిక వసతులు కల్పిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. బిలాడిపత్రి నుంచి జగన్నాథ బావి వరకు రూ.24.50 లక్షలతో సీసీ రోడ్డు, అక్కడి నుంచి చెంచుగూడెం వరకు రూ.17 లక్షలతో ఏర్పాటు చేస్తున్న గ్రావెల్ రోడ్డు పనులను ఆదివారం జెడ్పీ చైర్మన్ పరిశీలించారు. ఎక్కడెక్కడ కల్వర్టులు నిర్మించాలనే వివరాలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో చెంచుల ప్రధాన సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. ఏన్నో ఏళ్లుగా అంధకారంలో ఉన్న వాళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించామని, బోరు వేసి తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. చెంచులకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు కూడా నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరయ్య, వైస్ ప్రెసిడెంట్ క్రిష్టారెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



డీవీఆర్ రెడ్డిని పరామర్శిస్తున్న రాష్ట్ర నాయకులు

డోన్ టౌన్/ప్యాపిలి : కార్మికుల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, కార్యదర్శులు ఇస్మాయిల్, భద్రావతి అన్నారు. డోన్‌కు వచ్చిన వారు సంఘం స్థానిక నాయకులతో కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం నంద్యాల్లో ఈ నెల 2వతేదీ జరిగిన విజయోత్సవ సభలో తీవ్ర అస్వస్థతకు గురై ప్యాపిలి మండలం గోపాలనగరంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎన్ఎంయూ నంద్యాల జిల్లా ప్రచార కార్యదర్శి అయిన డీవీఆర్ రెడ్డిని అక్కడికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చెన్నారెడ్డి, కర్నూలు జిల్లా కార్యదర్శి మద్దిలేటి, నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్‌రావు, శివరామ్, ఉరుకుంద, డోన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు సీతరామిరెడ్డి, బాల మద్దయ్య, గ్యారేజ్ కార్యదర్శి మాదవస్వామి,కోశాధికారి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఏరాశి కుటుంబానికి పరామర్శ



కోవెలకుంట్ల: మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏరాశి రామసుబ్బారెడ్డి మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామాన్ని చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ కోసం పాటు పడ్డ ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, దస్తగిరిరెడ్డి, వెంకటరామిరెడ్డి, కానాల రామసుబ్బారెడ్డి, తదితరులు ఉన్నారు.

పరామర్శ



రామసుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న చల్లా సూర్యప్రకాష్‌రెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి

బనగానపల్లె : మండలంలోని ఎర్రగుడి గ్రామం వైఎస్సార్‌సీపీ నాయకుడు రామసుబ్బారెడ్డిని అవుకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా సూర్యప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. రామసుబ్బారెడ్డి మోటార్ సైకిల్ ప్రమాదంలో తీవ్రగాయలకు గురైన విషయం తెలసిందే. ఈ మేరకు పట్టణంలోని గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న రామసుబ్బారెడ్డిని వారు పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల ఫలితమే కుల గణన

డోన్ టౌన్ : బీసీ కుల గణన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకరరావు ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించి కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావడంతోనే నేడు బీజేపీ ప్రభుత్వం కుల గణన నవంబర్ 15 నుంచి చేపట్టేందుకు కార్యాచరణ చేసిందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నాయకులు శీలం భాస్కర్‌నాయుడు తెలిపారు. కేంద్రం ప్రకటించిన కుల గణన నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కుల గణనతో బీసీలకు సామాజిక వర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు.

దసరా శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం



బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు



తిమ్మనాయినపేటలో రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు



అవుకులో రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో అమ్మవారు



రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో అమ్మవారు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆలయాల్లో ఆదివారం దసరా శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మొదటి రోజు నిర్వహించిన పూజకు పట్టణానికి చెందిన గోనెగండ్ల క్రిష్ణమూర్తి, లక్ష్మీదేవి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. వాసవీ కన్యాకాపరమేశ్వరీదేవి రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మారెమ్మ, ప్రసన్నభారతీ దేవి ఆలయాల్లో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో పూజలందుకున్నారు.

కొలిమిగుండ్ల: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. వందేళ్ల చరిత్ర కలిగిన తిమ్మనాయినపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మొదటి రోజు అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిమ్మనాయినపేట, తాడిపత్రి పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అవుకు: మండల కేంద్రం అవుకులోని అమ్మవారిశాలలో, మూలమ ఆలయంలో దేవి శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. శ్రీ వాసవి కన్యాకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ రాజ రాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి భక్తులు పూజలు చేసి, సాయంత్రం ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు.


శ్రీ శైలపుత్రిదేవి అలంకారంలో అమ్మవారు

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలు ఆలయాల్లో దసరా శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం ఆలయ కమిటీ పెద్దలు, అర్చకుల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహావాచనం, కలశ స్థాపన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైలపుత్రి దేవి అలంకారంలో శ్రీ చౌడేశ్వరిదేవి భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణంలోని కొండపేటలో వెలసిన అమ్మవారు స్వర్ణకవచాలాంకృత శ్రీ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



కనకదుర్గ అలంకరణలో అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



స్వర్ణకవచాలాంకృత దుర్గాదేవిగా...

డోన్ : దేవీశరన్నవరాత్రోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధ మధ్య ప్రారంభమయ్యాయి. డోన్ పట్టణంలోని ఆలయాల్లో వెలసిన అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పాతబస్టాండ్‌లో భవానీ భక్తమండలి సభ్యులు ఏర్పాటు చేసిన విజయ దుర్గ అమ్మవారు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నారు. పాతపేట వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన రహదారులను సైతం విద్యుత్ దీపాలతో అలకరించారు.

డోన్ టౌన్ : దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని స్థానిక అమ్మవారిశాలలో కొలువైన వాసవీ అమ్మవారికి ఆదివారం రాత్రి ఆర్యవైశ్యులు గోత్ర వృక్ష పల్లకీ సేవా నిర్వహించారు. 102 గోత్ర నామాలతో ఏర్పాటు చేసిన గోత్ర ఉత్సవ పల్లెకీలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, కార్యదర్శి రంగయ్య, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొచ్చెర్వు శ్రీను, సభ్యులు అబ్బిరెడ్డిపల్లె లింగం సుబ్బయ్య, శేషు,సుదర్శన్,ఎల్ల సుబ్బయ్య,రాజా ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక శ్రీమక్కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం నుంచి శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పతాకావిష్కరణతో ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వావవీ మాత స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. పూజా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజా మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు బైసాని సురేశ్, కార్యదర్శి ఊటకూరి రమేశ్ కుమార్, కోశాధికారి జొన్నలగడ్డ హరికృష్ణ, సహాయ కార్యదర్శులు బైసాని గిరిధర్‌బాబు, ఇసికేల మురళీకృష్ణ, సహాయ కోశాధికారులు జక్క శేషఫణి, నాయకంటి గురుప్రసాద్ పాల్గొన్నారు.

బేతంచెర్ల : మండల కేంద్రం బేతంచెర్లలోని సంజీవనగర్, హనుమాన్ నగర్, శ్రీనగర్, కొత్తపేట, జంగాలపేట కాలనీలతోపాటు గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థి ఆత్మహత్య

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వద్ద నిర్మాణంలో ఉన్న సాయిబాబ గుడి వెనుక ఉన్న కాలనీకి చెందిన సుభాషిని కుమారుడు విద్యార్థి ప్రణీత్ (13) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ భాస్కర్ తెలిపారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మృతుని తల్లి సుభాషిని రెండు రోజుల క్రితం తిరుపతికి వెళ్లగా చెల్లెలు శ్రావణితో కలిసి ప్రణీత్ ఇంటి వద్దనే ఉన్నాడు. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న ప్రణీత్ ఆదివారం ఉదయం ఇంటి సమీపంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి కూరగాయల మార్కెట్ వద్ద క్రికెట్ ఆడి ఇంటికి చేరుకున్నాడని మృతుని చెల్లెలు తెలిపినట్లు ఆయన తెలిపారు. ఇంటిలోని బెడ్ రూమ్ తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ప్రణీత్ ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో చెల్లెలు కిటికీ నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతున్న అన్నను చూపి తల్లికి పోన్ చేసింది. తల్లి ఇంటి ప్రక్క వాళ్లకు ఫోన్ చేసి చెప్పగా తలుపులు తొలగించి ప్రణీత్‌ను కిందకు దించారు. తిరుపతి నుంచి వచ్చిన మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురికి గాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ మెట్ట సమీపాన ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో ఆదివారం ఆటో బోల్తాపడింది. ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన 10 మంది వ్యవసాయ కూలీలు యంబా యి గ్రామంలో పొలం పనులకు వెళ్లి తిరిగి వ స్తుండగా ఈ ప్రమాదం జరిగింది. లక్ష్మీదేవి, మల్లిక, మణి, మౌలాబీ, షమీర్, నాగేశ్వరీకు గాయాలు కావడంతో శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు.

నేడు అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రారంభించనున్న మంత్రి



అర్బన్ హెల్త్ సెంటర్ల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

డోన్ : మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ నియోజకవర్గంలో రెండు రోజుల పాటు పర్యటించున్నారని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. సోమవారం ఉదయం 10 గంటలకు డోన్ పట్టణం చేరుకునే మంత్రి బుగ్గన స్థానిక పాతబస్టాండ్‌తో పాటు పాతపేటలో రూ.1.80కోట్లతో నిర్మించిన రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల నూతన భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం సాయంత్రం మంత్రి స్వగృహంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమవుతారు. 17వ తేదీన మంగళవారం ప్యాపిలి మండలం గార్లదిన్నె నుండి అలేబాద్ గ్రామం వరకు, మునిమడుగు నుండి అలేబాద్ వరకు నిర్మించిన నూతన రహదారిని ప్రారంభించి పాదయాత్ర నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ కార్యాలయం తెలియజేసింది.

ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

పాతబస్టాండ్‌లోని కూరగాయల మార్కెట్ ప్రక్కన, పాతపేట హిందూ స్మశానంకు వెళ్లే దారిలో అత్యాధునిక వసతులతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్లను మంత్రి ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, సాధిక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, డీఈ రసూల్, ఏఈ సురేష్‌లు ప్రారంభోత్సవం ఏర్పాట్లను పరిశీలించారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం , కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం విద్యుత్ సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ఆల్వకొండ, ముక్కమల్ల, వసంతాపురం, ఎగ్గోని, కానాల, అక్కం పల్లె, గిద్దలూరు, లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని చెప్పారు.